
నమస్తే తెలంగాణ
హనుమకొండ
10 | వరంగల్, శుక్రవారం 20 జూన్ 2025 | HANUMAKONDA


ఎల్లస్వామి సాగు చేసిన ఆడ, మగ వరి పంట

## అంతన్నరు.. ఇంతన్నరు..

# నిండా ముంచిండ్రు!

- సీడ్ ధాన్యం పేరిట రైతులను మోసం చేసిన కంపెనీలు
- అధిక దిగుబడి వస్తుందని మాయమాటలు
- సగం కూడా రాక అన్నదాతల బెంబేలు
- కొనుగోలు చేసిన పంట డబ్బులూ ఇవ్వకుండా ఇబ్బందులు
- కష్టాన్ని, పెట్టుబడిని నష్టపోతున్న కర్షకులు
- పోలీస్ స్టేషన్లలో ఫిర్యాదు చేస్తున్న రైతులు


ఆడ, మగ మక్కజొన్న విత్తనాల కంపెనీ తరపున రాసి ఇచ్చిన బాండ్ పేపర్

స్టేషన్ ఘన్‌పూర్, జూన్ 19 : భూమిని నమ్ముకొని ఆరుగాలం కష్టపడుతూ దేశానికి అన్నం పెడుతున్న రైతులకు కష్టాలు తప్పడం లేదు. విత్తనం వేసిన దగ్గరి నుంచి పంట అమ్ముకునేంత వరకు ఎన్నో రకాలుగా ఇబ్బందులు పడుతూనే ఉన్నారు. చివరకు అధిక దిగుబడి వస్తుందని ఆశచూపుతూ విత్తన కంపెనీలు సైతం అన్నదాతను మోసం చేస్తున్నాయి. వారి మాయమాటలు నమ్మి సాగు చేసిన రైతులు ప్రస్తుతం లబోదిబోమంటున్నారు. వివరాల్లోకి వెళితే.. జనగామ జిల్లా స్టేషన్‌ఘన్‌పూర్ మండలం సముద్రాల, నారాయణపురం గ్రామాల్లోని పలువురు రైతులకు అధిక దిగుబడి వస్తుందని మక్కజొన్న, వరి విత్తనాలను ఆయా కంపెనీలు అంటగట్టాయి. సముద్రాలకు చెందిన రైతు బుంగ ఎల్లస్వామికి జనగామకు చెందిన కంపెనీ ప్రతినిధి మహ్మద్ గౌస్ తమ కంపెనీ ఆడ, మగ వరి విత్తనాలు సాగు చేస్తే అధిక దిగుబడి వస్తుందని, తరుగు లేకుండా క్వింటాకు రూ. 11 వేలతో కొనుగోలు చేస్తామని నమ్మబలికాడు. విత్తన సమస్యతో పంట దిగుబడి రానిపక్షంలో ఎకరానికి రూ. 80 వేలు చెల్లిస్తామని, ఒకవేళ ప్రకృతి వైపరీత్యాలతో పంట దెబ్బతింటే ప్రభుత్వం మాదిరిగానే పరిహారం చెల్లిస్తామని బాండ్ పేపర్‌పై సైతం రాసిచ్చాడు. దీంతో నమ్మిన ఎల్లస్వామి తనకున్న ఎకరంతో పాటు మరో ఆరెకరాలు కౌలుకు తీసుకొని ఆడ, మగ విత్తన వరి సాగుచేశాడు. ఇందులో ఎకరంన్నర ఎండిపోగా, మిగతా పొలంలో మగ విత్తనం దిగుబడి రాగా, ఆడ విత్తనం ఫెయిల్ అయ్యింది. ఈ విషయాన్ని మహ్మద్ గౌస్‌కు తెలపగా పంటను పరిశీలించి నష్ట పరిహారం ఇస్తామని చెప్పడంతో పాటు ఏప్రిల్‌లో వరి పంటను కొనుగోలు చేసి తీసుకెళ్లాడు. అప్పటి నుంచి పరిహారంతో పాటు కొనుగోలు చేసిన పంటకు డబ్బులు ఇవ్వకపోగా, ఎవరికి చెప్పుకుంటావో చెప్పుకో అంటూ నిర్లక్ష్యంగా సమాధానమిస్తున్నాడని రైతు ఎల్లస్వామి ఆరోపించాడు. ఈ విషయమై పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినప్పటికీ డబ్బులు ఇవ్వడం లేదని, తప్పనిసరి పరిస్థితిలో పంట పెట్టుబడి కోసం అప్పు చేయాల్సి వస్తున్నదని ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు. అలాగే ఇదేవిధంగా సముద్రాల, నారాయణపురంతో పాటు చిల్పూరు, జఫర్‌గఢ్ మండలాలకు చెందిన పలువురు రైతులకు ఆడ, మగ మక్కజొన్న విత్తనాలను అంటగట్టి పంట కొనుగోలు చేసిన అనంతరం డబ్బులు ఇవ్వకుండా ఇబ్బందులు పెడుతున్నారు.

### సగం కూడా దిగుబడి రాలే..



సముద్రాల, నారాయణపురం గ్రామాలకు చెందిని ఎనిమిది మందితో పాటు చిల్పూర్, జఫర్‌గఢ్ మండలాలకు చెందిన పలువురు రైతులకు ఇండో అమెరికన్ కంపెనీకి చెందిన సీడ్ ఆర్గనైజర్ మాయమాటలతో ఆడ, మగ మక్కజొన్న విత్తనాలు అంటగట్టాడు. ఎకరానికి 30 క్వింటాళ్ల దిగుబడి వస్తుందని, క్వింటాకు రూ. 3 వేల ధర చెల్లిస్తామని, పెట్టుబడి కింద ఎకరానికి రూ. 4 వేలతో పాటు పంట దెబ్బతింటే రూ. 60 వేలు పరిహారం ఇస్తామని బాండ్ పేపర్‌పై రాసిచ్చాడు. అయితే దిగుబడి 15 క్వింటాళ్లు కూడా రాకపోగా పండిన కొద్ది పంటను కూడా కంపెనీ వారు తీసుకుపోయి మూడు నెలలవుతున్నది. పంట నష్ట పరిహారం, మక్కజొన్న పైసలు ఇవ్వాలని అడిగితే తర్వాత ఇస్తామంటూ నిర్లక్ష్యంగా మాట్లాడుతున్నాడు. వారం రోజుల కింద పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాను. వానకాలం పెట్టుబడి కోసం అప్పు చేసే పరిస్థితి వచ్చింది.

– జలగం ప్రవీణ్, రైతు, సముద్రాల

### మాయమాటలకు మోసపోవద్దు

అధిక దిగుబడి వస్తుందని, ధర అధికంగా చెల్లిస్తామని చెప్పే ప్రైవేట్ వ్యక్తుల మాయమాటలు నమ్మొద్దు. గుర్తింపు పొందిన, లైసెన్స్ ఉన్న కంపెనీలకు చెందిన విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు మాత్రమే వినియోగించాలి. ప్రతి దానికి బిల్లును తప్పనిసరిగా తీసుకోవాలి. ప్రైవేట్ వ్యక్తులు సూచించే విత్తనాల విషయాన్ని మా దృష్టికి తీసుకురావాలి.

– చంద్రన్ కుమార్, మండల వ్యవసాయాధికారి, స్టేషన్‌ఘన్‌పూర్

## నా రెండు కాళ్లు పట్టుకుంటే ఎమ్మెల్యేను చేసినం

- పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డిపై కొండా మురళి సంచలన వ్యాఖ్యలు
- మంత్రి పదవి కోసమే కాంగ్రెస్ పార్టీలో చేరిన వారి పట్ల అప్రమత్తంగా ఉండాలి
- కడియం శ్రీహరిని ఉద్దేశించి సీఎం రేవంత్‌రెడ్డికి సూచన

పోచమ్మమైదాన్, జూన్ 19: 'పరకాలలో దరిద్రమైన నాయకుడు.. 75 ఏండ్ల ముసలోడు వచ్చిండు. ఆనాడు నా రెండు కాళ్లు పట్టుకుండు. నన్ను ఒక్కసారి గెలిపించమని బతిమిలాడితే ఎమ్మెల్యేను చేసినం' అని పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డిపై కొండా మురళి సంచలన వ్యాఖ్యలు చేశాడు. గురువారం వరంగల్ పోచమ్మమైదాన్‌లో జరిగిన కార్యక్రమంలో కొండా మురళి కాంగ్రెస్ పార్టీలో చేరిన మాజీ మంత్రి కడియం శ్రీహరి, పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డిపై పరోక్షంగా కీలక వ్యాఖ్యలు చేశా రు. 'ఇజ్జత్ ఉంటే రాజీనామా చేసి మళ్లీ గెలవాలి' అని కాంగ్రెస్ పార్టీలో చేరిన ఎమ్మెల్యేలకు సవాల్ విసిరారు. సుదీర్ఘకాలం మంత్రిగా పనిచేశానని చెప్పుకొని తిరిగిన నాయకులు గతంలో వారు పనిచేసిన పార్టీలను భ్రష్టు పట్టించారని మండిపడ్డారు. 'నిన్న.. కేసీఆర్ మంత్రి పదవి ఇస్తే బీఆర్‌ఎస్ పార్టీని భ్రష్టుపట్టించారు. అంతకుముందు చంద్రబాబును భ్రష్టుపట్టించి.. ఇప్పుడు కాంగ్రెస్‌లో చేరి పార్టీని ఆగం చేస్తున్న నాయకుల పట్ల జాగ్రత్తగా ఉండాలన్నా' అంటూ సీఎం రేవంత్‌రెడ్డికి సూచించారు. కేవలం మంత్రి పదవి కోసమే కాంగ్రెస్ పార్టీలో చేరిన నాయకుల పట్ల అప్రమత్తంగా ఉండాలని, వారి చర్యలతో పార్టీకి, ప్రజలకు తీవ్ర నష్టం వాటిల్లుతుందన్నారు. 'రేవంతన్నా... మీకు ఒకటి చెప్పదలుచుకున్నా.. వరంగల్‌లో కొంతమంది నాయకులు తెలుగుదేశంలో 15 సంవత్సరాలు ఉండి ఆ పార్టీని భ్రష్టుపట్టించారు. మంత్రి పదవులు అనుభవించి.. చంద్రబాబును ఓడించారు. మళ్లీ కేసీఆర్ దగ్గర చేరి మంత్రి పదవులు అనుభ వించి పాపం ఆయనను తప్పుదోవ పట్టించి నాశనం చేశారు. ఇప్పుడు మళ్లీ కాంగ్రెస్‌లో పార్టీలో చేరి ఏమి చేస్తారో తెలియదు. ఇసొంటోళ్లతోని మనం జర జాగ్రత్తగా ఉండాలె' అని మాజీ మంత్రి కడియం శ్రీహరిని ఉద్దేశించి సీఎంకు సూచించారు. వచ్చే ఎన్నికల్లో పరకాలలో తన కూతురు సుశ్మిత ఎమ్మెల్యే అవుతుందన్నారు. తానూ ఎమ్మెల్సీ అవుతానని చెప్పారు. మంత్రి కొండా సురేఖ వరంగల్ తూర్పులో ఉంటారని స్పష్టం చేశారు.

## సీపీకి కొండా మురళి సవాల్

- ముందు మీ డిపార్ట్‌మెంట్‌ను చక్కదిద్దుకోండి
- మీరిచ్చిన చార్జి మెమోలు బయటికెలా వచ్చాయ్?
- కమిషనర్ నోటీసులను లెక్కచేయని తూర్పు పోలీస్ అధికారులు
- మళ్లీ మురళికి ముగ్గురు ఇన్‌స్పెక్టర్లు, ఎస్సైలు బందోబస్తు డ్యూటీ

సుబేదారి, జూన్19 : 'మీ డిపార్ట్‌మెంట్‌లో కోవర్టులు ఉన్నారు.. మీరిచ్చిన చార్జీ మెమోలు ఎలా బయటికి వచ్చాయి?, ముందు అది సరిచేసుకోండి అని' మాజీ ఎమ్మెల్సీ కొండా మురళీధర్‌రావు వరంగల్ పోలీస్ కమిషనర్‌కు సవాల్ విసిరారు. గురువారం వరంగల్ పోచమ్మ మైదాన్ సెంటర్‌లో నిర్వహించిన కాంగ్రెస్ పార్టీ అధినేత రాహుల్ గాంధీ జన్మదిన వేడుకల్లో మాట్లాడారు. బీజేపీ నాయకుడు తన వెంట ఉన్న పోలీసు అధికారులను తప్పించాలని అంటున్నాడు.. ఆయనకు కూడా గన్‌మెన్లు ఉన్నారు.. కోళ్లఫారాలు నడుపుతున్న ఆయనను కోడి కూడా పొడవదు.. మరి ఆ నాయకుడికెందుకు గన్‌మెన్లు అంటూ ప్రస్తావించాడు. సీపీ తన వెంబడి ఉంటున్న పోలీసు అధికారులకు చార్జి మెమోలు ఇచ్చాడు. అవి ఎలా బయటికి వచ్చాయి?, ముందు మీ డిపార్ట్‌మెంట్‌ను చక్కదిద్దుకోండని సలహా ఇచ్చాడు.

- కడియం, రేవూరి టార్గెట్‌గా విమర్శలు
- ఇజ్జత్ ఉంటే రాజీనామా చేయాలని సవాల్
- రాహుల్ గాంధీ జన్మదిన వేడుకల్లో సంచలన కామెంట్లు
- 'హస్తం'లో తారాస్థాయికి చేరిన వర్గ విభేదాలు

కాంగ్రెస్ పార్టీలో మాజీ ఎమ్మెల్సీ కొండా మురళీధర్‌రావు చేసిన ఘాటు వ్యాఖ్యలు చిచ్చు రగిలించాయి. సొంత పార్టీ ఎమ్మెల్యేలనే టార్గెట్‌గా ఆయన చేసిన విమర్శలు పార్టీలో కలకలం రేపాయి. ఏఐసీసీ నాయకుడు రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలో ఉమ్మడి జిల్లాలోని ఎమ్మెల్యేలు కడియం శ్రీహరి, రేవూరి ప్రకాశ్‌రెడ్డిపై పరోక్షంగా ఆయన చేసిన వ్యాఖ్యలతో కాంగ్రెస్ పార్టీలో వర్గ విభేదాలు తారాస్థాయికి చేరాయి. ఇతర పార్టీల నుంచి వచ్చిన ఎమ్మెల్యేలు ఇజ్జత్ ఉంటే రాజీనామాలు చేయాలని ఆయన చేసిన సవాల్ రాష్ట్రవ్యాప్తంగా ప్రకంపనలు సృష్టించాయి. కొండా మురళి సొంత పార్టీ ఎమ్మెల్యేలపై చేసిన హాట్ కామెంట్స్, సవాళ్లు చర్చనీయాంశంగా మారాయి. - వరంగల్, జూన్ 19

## సొంత పార్టీ ఎమ్మెల్యేలపై ఘాటు వ్యాఖ్యలు



# కాంగ్రెస్‌లో కొండా చిచ్చు

పార్టీ అగ్ర నేత రాహుల్‌గాంధీ జన్మదిన వేడుకలో కొండా మురళి ప్రసంగం అంతా కడియం శ్రీహరి, రేవూరి ప్రకాశ్‌రెడ్డిలే టార్గెట్‌గా సాగింది. ఎన్నడూ ఎక్కువగా మాట్లాడని ఆయన ఈ సారి ప్రసంగం అంతా సంచలన వ్యాఖ్యలు, సవాళ్లతో సాగింది. కడియం శ్రీహరిని ఎన్‌కౌంటర్ స్పెషలిస్ట్‌గా పోల్చడం, టీడీపీని భ్రష్టుపట్టించి, చంద్రబాబును వెన్నుపోటు పొడిచి, టీఆర్‌ఎస్‌లో చేరి కేసీఆర్, కేటీఆర్‌ను తప్పుదోవ పట్టించిన వ్యక్తి కాంగ్రెస్‌లో చేరారు. ఇప్పుడు కాంగ్రెస్ పార్టీని ఏం చేస్తారో అని ఘాటు వ్యాఖ్యలు చేయడం కాంగ్రెస్ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారింది. పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి టార్గెట్‌గా కొండా మురళి చేసిన వ్యాఖ్యలతో వారి మధ్య ఉన్న విభేదాలు మరోసారి బయటపడ్డాయి. గతంలో మంత్రి సురేఖ, ఎమ్మెల్యే రేవూరిలు బాహాటంగా విమర్శలు చేసుకోవడం, పోలీసు కేసులు పెట్టుకోవడం అప్పట్లో కాంగ్రెస్ పార్టీలో చర్చనీయాంశమయ్యాయి. మంత్రి సురేఖ, ఎమ్మెల్యే రేవూరి మధ్య పచ్చగడ్డి వేస్తే భగ్గుమనే స్థాయిలో విభేదాలు ఉన్నాయి. అయితే ఇప్పుడు కొండా మురళి ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డిపై సంచలన వ్యాఖ్యలు చేశారు. 75 ఏళ్ల ముసలోడు, దరిద్రుడు వచ్చాడు. తన కాళ్లు పట్టుకుంటే ఎమ్మెల్యే చేశానని చేసిన హాట్ కామెంట్లతో వర్గ విభేదాలు భగ్గుమన్నాయి. వచ్చే ఎన్నికల్లో పరకాల నుంచి తన కూతురు కొండా సుష్మిత పటేల్ పోటీ చేస్తుందని ప్రకటించి ఇటు స్థానిక ఎమ్మెల్యేకు, కాంగ్రెస్ పార్టీకి సవాల్ విసిరారు.

### వివాదాలకు కేరాఫ్

రాజకీయాల్లో కొండా మురళి, సురేఖ వ్యవహార శైలి ఏ పార్టీలో ఉన్న వివాదాస్పదంగా ఉంటుంది. ప్రస్తుతం కాంగ్రెస్ పార్టీలో వారికి సొంత పార్టీ ఎమ్మెల్యేలతో సఖ్యత లేకుండా పోయింది. ఉమ్మడి జిల్లాలోని సొంత పార్టీ ఎమ్మెల్యేలపై కొండా మురళి చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు కాంగ్రెస్ పార్టీలో దుమారం రేపుతోంది. ఉమ్మడి జిల్లాలో అందరూ ఒక వైపు కొండా ఒక వైపుగా ఉన్నారు. కొండా సురేఖ, మురళి చేస్తున్న వ్యాఖ్యలు పార్టీకి నష్టం కలిగిస్తున్నాయని నిజమైన కాంగ్రెస్ అభిమానులు వాపోతున్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారం లేనప్పటి నుంచి పార్టీ జెండాలు మోస్తున్న కార్యకర్తలు పార్టీలోని గ్రూప్ విభేదాలతో నలిగిపోతున్నారు. సొంత ఎజెండాతో వర్గ విభేదాలు సృష్టించి పార్టీని ప్రజల్లో చులకన చేస్తున్నారని దశాబ్దాల కాలంగా కాంగ్రెస్ జెండా మోసిన కార్యకర్తలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

## మళ్లీ అదే రిపీట్

**కొండాకు ఎస్కార్ట్‌గా ముగ్గురు ఇన్‌స్పెక్టర్లు, ఎస్సైలు**

వారం క్రితం వరంగల్ తూర్పు నియోజకవర్గంలో పనిచేస్తున్న ఏసీపీ, ఇన్‌స్పెక్టర్లు, ఎస్సైలు విధులు వదిలి ప్రొటోకాల్ లేని మాజీ ఎమ్మెల్సీ కొండా మురళీధర్‌రావుకు ఎస్కార్ట్‌గా వెళ్లారు. ఈ విషయంపై 'నమస్తే తెలంగాణ'లో వచ్చిన కథనంపై సీపీ విచారణ జరిపించి, రెండు విడుతలుగా వరంగల్ ఏసీపీ నందిరాంనాయక్, ఇన్‌స్పెక్టర్లు బొల్లం రమేశ్, తుమ్మ గోపిరెడ్డి, షుకూర్, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ రామకృష్ణకు చార్జి మెమోలు ఇచ్చారు. అయినప్పటికీ వాటిని బేఖాతర్ చేస్తూ గురువారం పోచమ్మ మైదాన్‌లో జరిగిన ఓ ప్రైవేట్ కార్యక్రమానికి హాజరైన కొండా మురళికి బందోబస్తుగా ఇన్‌స్పెక్టర్లు షుకూర్, గోపిరెడ్డి, వరంగల్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ రామకృష్ణ, ఎస్సైలు వచ్చారు. గంటన్నర పాటు అక్కడే ఉండిపోయారు.

# నీళ్ల కోసం రోడ్డెక్కిన మహిళలు

బయ్యారం, జూలై 19 : 'ఐదు రోజులుగా నీరు రావడంలేదు.. గోస పడుతున్నా ఎవరూ పట్టించుకోవడం లేదు' అంటూ మహిళలు ఖాళీ బిందెలతో రోడ్డుపైకి వచ్చారు. బయ్యారం మండలంలోని ఉప్పలపాడులో కొన్ని రోజులుగా మిషన్ భగీరథ నీటి సరఫరా నిలిచిపోయింది. ప్రత్యామ్నాయంగా జీపీ సిబ్బంది నీటి సరఫరా చేయాల్సి ఉన్నప్పటికీ నిర్లక్ష్యంగా వ్యవహరించారు. నీటి సమస్య తీవ్రమవడంతో గురువారం ఖాళీ బిందెలతో నిరసన చేపట్టారు. సమస్య చెప్పుకుందామంటే సర్పంచు లేడని, సెక్రటరీకి చెబితే మోటరు కాలిపోయిందని చెప్తున్నాడని ఆవేదన వ్యక్తం చేశారు. రోజుల తరబడి నీరు లేకుంటే ఊళ్లో ఎలా ఉండాలని వారు ప్రశ్నించారు. ఇప్పటికైనా తమ గ్రామంలో నీటి సమస్య తీర్చాలని కోరారు.


గ్రామంలోని రహదారిపై నీళ్ల కోసం ఖాళీ బిందెలతో నిరసన తెలుపుతున్న మహిళలు


బీఆర్‌ఎస్ పార్టీ జిల్లా కార్యాలయంలో మాట్లాడుతున్న పెద్ది సుదర్శన్‌రెడ్డి

# రేవంత్‌రెడ్డి అవివేకి..

- ప్రాజెక్ట్‌లపై కనీస అవగాహన లేని ముఖ్యమంత్రి
- గోదావరి బనకచర్ల లింక్డ్ ప్రాజెక్ట్‌తో ఉమ్మడి వరంగల్ జిల్లా ఎడారి
- కాళేశ్వరంపై కుట్రలు చేస్తున్న కాంగ్రెస్
- దేవాదులపై అవహేళనగా మాట్లాడిన సీఎం ప్రజలకు క్షమాపణ చెప్పాలి
- నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి ఫైర్

హనుమకొండ, జూన్ 19 : 'ప్రాజెక్టులపై అవగాహలేని అవివేకి సీఎం రేవంత్‌రెడ్డి.., గోదావరి బనకచర్ల లింకు ప్రాజెక్టుతో ఉమ్మడి వరంగల్ జిల్లా ఎడారిగా మారనుంది.., దేవాదుల ప్రాజెక్టుపై సీఎం వెకిలి మాటలను ఖండిస్తున్నాం' అని నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి కాంగ్రెస్‌పై ఫైర్ అయ్యారు. గురువారం హనుమకొండ బాలసముద్రంలోని బీఆర్‌ఎస్ పార్టీ జిల్లా కార్యాలయంలో కార్పొరేషన్ మాజీ చైర్మన్ నాగుర్ల వెంకటేశ్వర్లుతో కలిసి విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గోదావరి, కృష్ణా జలాల గురించి తెలియని సీఎం తెలంగాణ నీటి వనరులను ఎలా కాపాడుతాడని ప్రశ్నించారు. చిన్న పగుళ్లను సాకుగా చూపి కాళేశ్వరం కూలిపోయిందని విషప్రచారం చేశారని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం కుట్రపూరితంగానే కాళేశ్వరాన్ని పండబెట్టి రైతుల పొలాలను ఎండగొట్టిందన్నారు. నాట్లకు నాట్లకు మధ్య కేసీఆర్ రైతుబంధు ఇస్తే రేవంత్‌రెడ్డి మాత్రం ఓట్లకు ఓట్లకు మధ్య ఇస్తూ ఓట్ల రాజకీయం చేస్తున్నారని మండిపడ్డారు. రేవంత్‌రెడ్డి వేసే డబ్బులు రైతు భరోసా కాదు.. ఎన్నికల భరోసా అని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చి హామీ ప్రకారం ఇప్పటివరకు రైతులకు ఎకరాకు రూ. 25వేల చొప్పున బకాయిపడ్డారని, ఆ నగదు రైతుల ఖాతాలో వేస్తేనే కాంగ్రెస్ పార్టీకి రైతులపై చిత్తశుద్ధితో ఉన్నట్లని పెద్ది అన్నారు. సీఎం రేవంత్‌రెడ్డికి, నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి తెలంగాణకు హక్కుగా రావాల్సిన నీటి వనరులపై కనీస అవగాహన లేదన్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లాకు నీరందించే దేవాదుల ప్రాజెక్టు ఏ బేసిన్‌లో ఉందో కూడా రేవంత్‌రెడ్డికి అవగాహన లేదని, వీరు తెలంగాణ హక్కులను ఎలా కాపాడుతారని ప్రశ్నించారు. ఉమ్మడి కరీంనగర్, వరంగల్, ఖమ్మం జిల్లాలను ఎడారిగా మార్చే బనకచర్ల ప్రాజెక్టు నిర్మాణాన్ని బీఆర్‌ఎస్ పార్టీ తీవ్రంగా ఖండిస్తున్నదని స్పష్టం చేశారు. ఉమ్మడి వరంగల్ జిల్లా తాగు, సాగునీటి అవసరాల కోసం కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా నిర్మించి, అభివృద్ధి చేసిన పాకాల, గణపురం, లక్నవరం రిజర్వాయర్లపై ఏపీ ప్రభుత్వం కేంద్రానికి ఫిర్యాదు చేయడాన్ని పెద్ది తప్పుబట్టారు. ఉమ్మడి వరంగల్ జిల్లాకు అన్యాయం జరుగుతున్నా స్థానిక మంత్రులు సీతక్క, సురేఖ, ఎమ్మెల్యేలు, కనీసం నోరు మెదపడం లేదన్నారు. కుట్రపూరితంగా కాళేశ్వరంలో నీటిని నిల్వ చేయకపోవడంతో ఎస్సారెస్పీలోని డీబీఎం-38 కాల్వ పూర్తిగా వట్టిపోయి రైతుల పొలాలు ఎండిపోయాయని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం మార్చి నాటికే నీళ్లు ఇవ్వలేమని చేతులెత్తేసిందని, ఎర్రటి ఎండలు మే నెలలో సైతం నీటిని విడుదల చేసిన ఘనత కేసీఆర్ పాలనకు దక్కుతుందన్నారు. తెలంగాణ ఉద్యమ ఆకాంక్షలు, ప్రజల అవసరాలు తెలియని రేవంత్‌రెడ్డి వారి ప్రయోజనాలను ఎలా కాపాడుతాడని ప్రశ్నించారు. రేవంత్‌రెడ్డి గురువైన చంద్రబాబు ప్రయోజనాల కోసమే పనిచేస్తున్నాడని ఆరోపించారు. బనకచర్ల విషయంలో బీజేపీ ఎందుకు మాట్లాడడం లేదన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి గోదావరి, కృష్ణా జలాలపై కనీస అవగాహన లేకుండా పరిపాలన సాగిస్తున్నందుకు, తెలంగాణ ప్రజల హక్కులను కోల్పోయేలా చేస్తున్న వారు ప్రజలకు క్షమాపణ చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. సమావేశంలో వరంగల్ పశ్చిమ నియోజకవర్గ కోఆర్డినేటర్ పులి రజినీకాంత్, మాజీ కార్పొరేటర్ జోరిక రమేశ్ తదితరులు పాల్గొన్నారు.


టేకుమట్లలోని గ్రామాల్లో వెలిసిన ఫ్లెక్సీ

- నేడు ఇంటికి చేరనున్న గణేశ్ మృతదేహం
- రంపచోడవరంలో డెడ్‌బాడీని గుర్తించిన కుటుంబ సభ్యులు
- 36 గంటల తర్వాత చూసేందుకు అనుమతి
- ఫొటోలు విడుదల చేయని పోలీసులు
- కడసారి చూపు కోసం ఎదురుచూపులు

# వెలిశాలలో ఉత్కంఠ

జయశంకర్ భూపాలపల్లి, జూన్ 19 (నమస్తే తెలంగాణ)/టేకుమట్ల : విప్లవోద్యమంలో నేలరాలిన వెలిశాల వేగుచుక్క మృతదేహం నేడు స్వగ్రామంకు చేరుకోనున్నది. గణేశ్ మృతదేహం ఎప్పుడొస్తుందా.. అని కడసారి చూపుకోసం అభిమానులు, మిత్రులు, గ్రామస్తులు ఎదురుచూస్తున్నారు. ఇప్పటికే మిత్రులు, అభిమానులు వెలిశాల పరిసర గ్రామాలకు చేరుకున్నారు. గ్రామంలో 'జోహార్ కామ్రేడ్స్' అంటూ ఎర్ర బ్యానర్లు వెలుస్తున్నాయి. గణేశ్ అంత్యక్రియలకు బంధుమిత్రులు భారీగా ఏర్పాట్లు చేస్తుండగా, పోలీసులు ప్రత్యేక ఫోకస్ పెట్టారు. గణేశ్ మృతదేహం కోసం ఆంధ్రా, ఒడిశా సరిహద్దుల్లోని అల్లూరి సీతారామరాజు జిల్లా రంపచోడవరానికి చేరుకున్న కుటుంబ సభ్యులకు గురువారం మధ్యాహ్నం వరకు మృతదేహాన్ని చూపించలేదు. కనీసం ఎక్కడున్నదనే విషయం కూడా గోప్యంగా ఉంచారు. ఎన్‌కౌంటర్ జరిగిన రోజే గణేశ్ మృతి చెందినట్లు ప్రకటించిన పోలీసులు సుమారు 36 గంటలు దాటినా మృతుల ఫొటోలు విడుదల చేయలేదు. మృతులను చూపించకపోవడంతో అసలేం జరుగుతున్నదని కుటుంబ సభ్యులు మండిపడ్డారు. ఈ విషయమై రంపచోడవరంలో గణేశ్ సోదరుడు గాజర్ల అశోక్ అలియాస్ ఐతు విలేకరులతో మాట్లాడారు. గణేశ్ మృతిపై అనుమానాలు వ్యక్తం చేశారు. దీంతో పోలీసులు గురువారం మధ్యాహ్నం ఒక్కొక్కరిని మృతదేహాలను చూసేందుకు అనుమతించారు. ఫొటోలు మాత్రం తీయనివ్వలేదని కుటుంబసభ్యులు తెలిపారు. కాగా, గురువారం మధ్యాహ్నం గణేశ్ మృతదేహాన్ని చూసేందుకు అనుమతిచ్చారని, మృతి చెందింది గణేశ్ అని నిర్ధారించుకున్నట్లు కుటుంబ సభ్యుల ద్వారా వెలిశాలకు తెలిసింది. గురువారం అక్కడ పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించే అవకాశం ఉండగా, మృతదేహం శుక్రవారం తెల్లవారుజామున వెలిశాలకు చేరనున్నది. దీంతో వెలిశాలలో విషాదఛాయలు అలుముకున్నాయి. కాగా, 'వెలిశాల' పేరుతో ఏర్పాటు చేసిన వాట్సాప్ గ్రూప్ ద్వారా గణేశ్ ఎన్‌కౌంటర్‌కు సంబంధించిన సమాచారాన్ని గ్రామస్తులు తెలుసుకుంటూ, అందులో పోస్టులు పెడుతున్నారు. విప్లవోద్యమానికి వెలిశాల అందించిన బిడ్డలను ఉద్దేశించి కవి మిట్టపల్లి సురేందర్ రాసిన 'తల్లీ నా వెలిశాల' అనే పాట, ఈ పాట రాసి 20 ఏళ్లు అయిన సందర్భంగా జరిపిన సభ ఫొటోలు ఈ సందర్భంగా వైరల్‌గా మారుతున్నాయి.


రంపచోడవరంలో రవి మృతదేహం కోసం నిరీక్షిస్తున్న కుటుంబ సభ్యులు

### ప్రీ ప్లాన్డ్‌గానే మర్డర్ చేశారా? : గాజర్ల అశోక్

పోలీసులు మా అన్న గాజర్ల అశోక్ అలియాస్ గణేశ్‌ను పట్టుకొని కొంతకాలం చిత్రహింసలకు గురిచేసి ప్రీ ప్లాన్డ్‌గానే మర్డర్ చేసినట్లు పోలీసుల తీరును బట్టి తెలుస్తున్నదని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి గాజర్ల అశోక్ అలియాస్ ఐతు అన్నారు. గురువారం ఆయన తన కుటుంబ సభ్యులతో కలిసి రంపచోడవరంలో విలేకరులతో మాట్లాడారు. పోలీసులు తమ సోదరుడి పేరు ప్రకటించడంతో బుధవారం రాత్రి రంపచోడవరానికి చేరుకున్నామని, రాత్రి మృతదేహాన్ని చూపించడం వీలుకాదని, ఉదయమే చూపిస్తామని చెప్పారని అన్నారు. ఎన్‌కౌంటర్ జరిగి 24 గంటలు గడుస్తున్నా ఇంతవరకు ఫొటోలు కూడా విడుదల చేయలేదని, మృతదేహాలు ఎక్కడున్నాయో కూడా చెప్పడం లేదన్నారు. దీనిని బట్టి తమకు గంటగంటకూ ఎన్‌కౌంటర్‌పై అనుమానాలు పెరుగుతున్నాయన్నారు. మీడియాకు సైతం ఇప్పటి వరకు అనుమతివ్వకపోవడమేంటన్నారు. డెడ్‌బాడీలు చూస్తే విషయం బయటపడుతుందనే చూపించడం లేదా అని మండిపడ్డారు. దండకారణ్యంలో ఎన్‌కౌంటర్ జరిగినా మోదీ, అమిత్‌షా ట్విట్టర్ ద్వారా ఫొటోలు విడుదల చేశారు. ఇక్కడ ఎందుకు విడుదల చేయడం లేదని ప్రశ్నించారు.

### ఎన్‌కౌంటర్ బూటకం : సీపీయూఎస్ఐ రాష్ట్రకార్యదర్శి వెంకన్న

ఈ నెల 18న ఆంధ్రా, ఒడిశా సరిహద్దుల్లో జరిగిన ఎన్‌కౌంటర్ బూటకమని సీపీయూఎస్ఐ పార్టీ దళిత బహుజన శ్రామిక విముక్తి రాష్ట్ర కార్యదర్శి దైద వెంకన్న ఒక ప్రకటనలో తెలిపారు. రంపచోడవరం అటవీప్రాంతంలో గాజర్ల రవి అలియాస్ గణేశ్, అరుణక్క, అంజి అనారోగ్యరీత్యా షెల్టర్ తీసుకుంటుండగా ఓ విప్లవ ద్రోహి ఇచ్చిన సమాచారంతో ముగ్గురిని ప్రాణాలతో పట్టుకొని హింసించి బూటకపు ఎన్‌కౌంటర్ చేశారన్నారు. ఈ ఎన్‌కౌంటర్‌ను తీవ్రంగా ఖండిస్తున్నామని, హైకోర్టు జడ్జితో న్యాయవిచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. ఈ మారణహోమాన్ని ఆపాలని, ఆపరేషన్ కగార్‌ను నిలిపివేయాలని మావోయిస్టు ఇచ్చిన బంద్ పిలుపునకు తాము మద్దతు తెలుపుతున్నట్లు ప్రకటించారు.

# పసుపు రైతుల ఆందోళన

**ఈ- నామ్ రద్దు చేసి జెండా పాట పెట్టాలని డిమాండ్**

కాశీబుగ్గ, జూన్19: వరంగల్ ఎనుమాముల వ్యవసాయ మార్కెట్‌లో గురువారం పసుపు రైతులు ఆందోళన చేపట్టారు. ఈ-నామ్ ద్వారా పసుపు తక్కువ ధరకే కొనుగోలు చేస్తున్నారని, గిట్టుబాటు ధర కల్పించాలని డిమాండ్ చేశారు. దీంతో రెండు గంటలపాటు క్రయవిక్రయాలు నిలిచిపోయాయి. విషయం తెలుసుకున్న మార్కెట్ కమిటీ అధికారులతో పాటు అడ్తి సెక్షన్ అధ్యక్షుడు ఎన్‌రెడ్డి లింగారెడ్డి, ఎనుమాముల ఎస్సై మిరిపెల్లి రాజు పసుపు యార్డుకు చేరుకొని రైతులతో మాట్లాడారు. వ్యాపారులు సిండికేట్‌గా మారి కావాలనే తక్కువ ధరతో క్రయవిక్రయాలు చేస్తున్నారని రైతులు ఆరోపించారు. అత్యధికంగా పసుపు క్వింటాకు రూ.12,550 పలికితే, మిగతా సరుకును క్వింటాకు రూ.6వేల నుంచి రూ.3,500 కే కొనుగోలు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో మార్కెట్‌లో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. కాగా, ఈ-నామ్ ద్వారా కొన్ని లాట్‌లకు సింగిల్ టెండర్ వేయగా, వాటికి డమ్మీగా అధికారులు ధరలు వేసి టెండర్ ఓపెన్ చేసినట్లు తెలిపారు. దీంతో అతి తక్కువగా ధరలు కోడ్ కావడంతో రైతులు ఆందోళన చేపట్టారు. తాము ఆరుగాలం కష్టపడి పంట పండించి మార్కెట్‌కు తెస్తే వ్యాపారులు తక్కువ ధరకే కొనుగోలు చేసి నిలువు దోపిడీ చేస్తున్నారని ఆరోపించారు. అత్యధికంగా పలికిన ధరకు కనిష్ఠంగా పలికిన ధరకు మధ్య వ్యత్యాసం చాలా ఉందన్నారు. ధరలు నచ్చితేనే విక్రయించుకోవాలని, నచ్చని రైతులు మరుసటి రోజు అమ్ముకోవాలని అధికారులు సూచించడంతో, ధర నచ్చని వారు మరుసటి రోజు విక్రయించేందుకు సిద్ధమయ్యారు. దీంతో ఆందోళన సద్దుమణగడంతో ఆలస్యంగా కాంటాలు నిర్వహించారు. కాగా, గురువారం 174లాట్‌ల పసుపు రాగా, అత్యధికంగా రూ.12,550, మధ్య రకానికి రూ.10వేలు, కనిష్ఠంగా రూ.3,500 ధరలు పలికాయి. కొన్ని లాట్స్‌కు సింగిల్ టెండర్లు పడగా, వాటికి మరుసటి రోజు టెండర్ నిర్వహించేందుకు సిద్ధమయ్యారు. భూపాలపల్లి జిల్లా మొగుళ్లపల్లి మండలంలోని ఇస్సిపేట గ్రామానికి చెందిన రైతు కొడారి రాజయ్యయాదవ్ తీసుకొచ్చిన పసుపు గోల రకం క్వింటాలుకు రూ.3,500 ధర పలుకకగా, తాను పెట్టిన పెట్టుబడి కూడా రాలేదని ఆవేదన వ్యక్తం చేశాడు.


పసుపు రైతులతో మాట్లాడుతున్న అధికారులు, అడ్తి వ్యాపారులు